క్లుప్తంగా

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

గద్వాల: మంత్రాలయ శ్రీ రాఘవేంద్రస్వామి 353వ ఆరాధన మహోత్సవాలను స్థానిక షేరెల్లివీధిలోని రాఘవేంద్రస్వామి మఠంలో సోమవారం నుంచి ప్రారంభమవుతాయని రాఘవేంద్రస్వామి మఠం విచారణ కర్త ప్రభాకర్ తెలిపారు. ఆరాధన మహోత్సవాల్లో భాగంగా 20న పూర్వారాధన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21న మధ్యారాధన, 22న ఉత్తరారాధన మహోత్సవాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన బస్సు



మానవపాడు: జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న బైక్‌ను బస్సు ఢీకొట్టిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్ వివరాల ప్రకారం.. బోరవెల్లికి చెందిన బోయ సుదర్శన్ నందికోట్కూర్‌లో బంధువుల వివాహానికి బయలుదేరి బోరవెల్లి స్టేజీకి వచ్చాడు. బైక్‌ను మానవపాడు స్టేజీ వద్ద ఆపేందుకు జాతీయ రహదారి-44 దాటుతుండగా, కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న సిటిబస్సు ఢీకొట్టింది. దీంతో బోయ సుదర్శన్ ఎడమకాలికి గాయాలయ్యాయి. బస్సులో ఉన్నవారి 16మందికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి అతన్ని తరలించారు. సుదర్శన్ పెద్దనాన్న కొడుకు బోయ శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ చేశారు.

పేలిన కార్ల టైర్లు: తప్పిన ప్రమాదం



ఉండవెల్లి: హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు ప్రయాణిస్తున్న కారు ముందు టైరు మండలంలోని జాతీయ రహదారిపై పేలింది. బాధితుల వివరాల ప్రకారం.. కర్నూల్‌కు చెందిన తరుణ్ చౌదరి, ఆయన తండ్రి చౌగాలాల్ చౌదరి, కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లి తిరిగి కర్నూల్ వస్తున్నారు. ఈ క్రమంలో ఉండవెల్లి శివారులో రహదారిపై ఒక్కసారిగా ముందు టైరు పేలడంతో కారు రోడ్డు అవతల నుంచి హైదరాబాద్ వైపుగా దూసుకెళ్లింది. కారులో ఉన్న ఏడుగురికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే పోలీసులు, హైవే సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించి కారును పక్కకు తొలగించారు.

టైరు పేలి చెట్టును ఢీకొని..

మండలంలోని అలంపూర్ చౌరస్తా సమీపంలోని కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు టైర్ పేలడంతో రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్నవారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

బాలుడికి ఆర్థికసాయం



మానవపాడు: రెండు సంవత్సరాల నుంచి నరాల వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైన రాజోళి మండలానికి చెందిన బాలుడు కె అఖిల్‌కు ఆదివారం గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ కార్యదర్శి మహ్మద్ సిరాజ్ రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండేళ్లుగా నరాల వ్యాధితో బాధపడుతున్న బాలుడికి ఆర్థికసాయం చేసినట్లు తెలిపారు.

శ్రీరామ్ సేవాసమితి సేవలు మరువలేనివి



రాజోళి: మండల కేంద్రంలో యువకులు ఏర్పాటు చేసిన జై శ్రీరామ్ సేవా సమితి అందిస్తున్న సేవలు మరువలేనివని చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు శివరామయ్య అన్నారు. ఆదివారం వైకుంఠ నారాయణ స్వామి ఆలయంలో సేవా సమితికి రూ.5 వేలు అందచేశారు. సేవా సమితి ప్రారంభమైనప్పటి నుంచి సేవలను గమనిస్తున్న ప్రజలు వారికి తోడుగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

రాజోళి: ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ నెల 6న వర్షం కురిసి, తర్వాత మళ్లీ కురవకపోవడంతో వాతావరణం బాగా వేడెక్కింది. ఫ్యాన్లు తిరుగుతున్నా ఉక్కపోతకు గురవుతున్నట్లు పేర్కొంటున్నారు. ఎండకు పంటలు దెబ్బతింటున్నాయని, రెండు రోజుల్లో వర్షాలు పడపోతే మొక్కలు ఎండిపోయే ప్రమాదముందని ఆవేదన చెందుతున్నారు.

'సాగు' పనులకు కూలీల కొరత

- డిమాండ్ పెరగడంతో రైతులకు అధికభారం
- ఇతర గ్రామాల నుంచి వాహనాల్లో కూలీల తరలింపు



పంటపొలాల్లో కలుపుతీస్తున్న కూలీలు

మానవపాడు: పంట పొలాల్లో కలుపు పెరగటంతో రైతులు కలత చెందుతున్నారు. ముందస్తు వర్షాలు ఎడతెరిపి లేకుండా కురవడంతో కలుపు మొక్కలు బాగా పెరిగాయి. కలుపు తీసేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కలుపు తీసేందుకు సొంతూరులో కూలీల కొరత ఏర్పడడంతో ఇతర మండలాల నుంచి తీసుకొచ్చి పనులు చేయిస్తున్నారు. ఈ



చెన్నిపాడు పంటపొలంలో పెరిగిన గడ్డి

పరిస్థితి నియోజకవర్గ వ్యాప్తంగా ఉంది. కలుపు తీయడానికి ఒక్కో ఎకరాకు 15 నుంచి 25 మంది కూలీలను వినియోగించాల్సి వస్తోంది. ఒక్కొక్క కూలీకి రూ.350 నుంచి రూ.550 చెల్లించాల్సి వస్తోంది.

రైతులకు పెరిగిన భారం

గ్రామాల్లో కలుపు తీయడానికి కూలీలు దొరకడం లేదు. కలుపు నివారించేందుకు రైతులు రసాయనాల ఎరువుల వైపు మొగ్గుచూపుతున్నారు. పెరిగిన ఖర్చుల వల్ల కలుపు తీసేందుకు రూ.1800 నుంచి రూ.3500 భారం అవుతోంది. ఎకరాకు రూ.7వేల నుంచి రూ.10వేల వరకు ఖర్చు అవుతోంది. వివిధ మండలాలు, రాజోళి, ఐజ, వడ్డేపల్లి, ఉండవెల్లి, కర్నూల్‌లోని ఇతర ప్రాంతాల నుంచి కూలీలు కలుపు తీసేందుకు వస్తున్నారు.

సమయానికి కూలీలు దొరకడం లేదు



ఇటీవల కురిసిన వర్షాల వల్ల పత్తిలో కలుపు మొక్కలు బాగా పెరిగాయి. దీంతో ఎకరం పత్తి పొలంలో కలుపు తీయడానికి కూలీల ఖర్చు పెరుగుతోంది. సమయానికి కూలీలు దొరకడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– శ్రీకాంత్‌రెడ్డి, రైతు, మానవపాడు

కలుపుతీత ఎకరాకు రూ.4వేలు చెల్లింపు



పంటపొలాల్లో విపరీతంగా పెరిగిన గడ్డిని తెలగించేందుకు ఎకరాకు రూ.4వేలు చెల్లిస్తున్నాం. కూలీల కొరత తీవ్రంగా ఉంది. దీంతో గుత్తకు ఎకరాకు రూ.4వేలు తీసుకుంటున్నారు. కూలీలకు వాహనాల కిరాయితో పాటు గుత్త డబ్బులు ఇవ్వాల్సి వస్తోంది.

– సుధాకర్, రైతు, గోకులపాడు

ఉపాధిహామీకి కూలీలను లింక్ చేయాలి



ఉపాధిహామీ పథకం ద్వారా పొలాల్లో కూలీలు పని చేసేలా లింక్ చేయాలి. దీంతో రైతులకు రూ.15వేల దాకా కూలీల ఖర్చుల భారం తగ్గుతుంది. ప్రభుత్వం రైతులను దృష్టిలో ఉంచుకోని ఉపాధిహామీ పథకం ద్వారా కలుపుతీతకు కూలీలను వినియోగిస్తే బాగుంటుంది.

– విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్, బోరవెల్లి

గద్వాల మహారాణికి నివాళి



మహారాణికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

గద్వాల: గద్వాల సంస్థానాధీశులలో ఒకరైన మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మకు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం కళాశాలలోని ఆమె విగ్రహానికి కళాశాల అధ్యాపకులు పూలమాలలు వేశారు. మహారాణి జ్ఞాపకార్థం గద్వాలలో ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొనసాగడం మనందరికీ గర్వకారణమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగభూషణం, వెంకటేషం, శంకర్, ఎల్లస్వామి, సురేష్, నరేష్‌బాబు, జగదీష్, వేణు, జ్యోతి, సమ్మయ్య పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో..

మహారాణి ఆదిలక్ష్మీదేవమ్మ వర్ధంతిని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ ఆశయాలు సాధిస్తాం



శాంతినగర్‌లో సర్దార్‌పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గౌడసంఘం నాయకులు



అయిజలో నివాళులర్పిస్తున్న కల్లుగీత సహకార సంఘం నాయకులు

శాంతినగర్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలు సాధిస్తామని గౌడ సంఘం నాయకులు అన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లో సర్దార్ పాపన్నగౌడ్ జయంతి వేడుకలను రాజోళి, వడ్డేపల్లి మండలాల గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర హైస్కూల్ నుంచి చాకలి ఐలమ్మ విగ్రహం వరకుబైక్ ర్యాలీ నిర్వహించారు. ఐలమ్మ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం సర్దార్ పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వడ్డేపల్లి గౌడసంఘం అధ్యక్షుడు రాధాకృష్ణగౌడ్, రాజోళి అధ్యక్షుడు జయన్నగౌడ్, ప్రధాన కార్యదర్శులు సిద్దయ్యగౌడ్, పరమేష్‌గౌడ్, లక్ష్మన్నగౌడ్, అయ్యన్నగౌడ్, భూషన్‌గౌడ్, వెంకట్రామన్‌గౌడ్, తిమ్మయ్యగౌడ్, భాస్కర్‌గౌడ్, గౌడసంఘం పెద్దలు పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలో సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతిని కల్లుగీత సహకార సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ప్రకాష్‌గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో కల్లుగీత సహకార సంఘం అధ్యక్షుడు గోకారిగౌడ్, ఉపాధ్యక్షుడు నాగన్నగౌడ్, సభ్యులు సవారి గౌడ్, భూపతి గౌడ్, వెంకట్రాములు గౌడ్ పాల్గొన్నారు.

రాజోళి: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను సాధిస్తామని గౌడ సంఘం మండల అధ్యక్షుడు జయన్నగౌడ్ అన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని వారు విలేకరులతో మాట్లాడారు. బహుజనుల రాజ్యాధికారం కోసం నిరంతరం పోరాటం చేసి, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించి, గోల్కొండ కోటను జయించిన వీరుడని అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ బీసీల మనుగడకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సిద్దయ్య గౌడ్, చంద్రగౌడ్, రామన్ గౌడ్, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

మైలగడ్డ బ్రిడ్జిపై ప్రమాదాలు



మైలగడ్డ బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలు

కేటీదొడ్డి: మైలగడ్డ దగ్గరలోని ర్యాలంపాడు కాల్వ బ్రిడ్జిపై గుంతలు ప్రమాదకరంగా మారాయి. వర్షపునీరు నిల్వ ఉండడంతో తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సమస్యను పరిష్కరించడంలో ఆర్‌అండ్ బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రం నుంచి గద్వాలకు వెళ్లే ప్రధాన రహదారి ఈ బ్రిడ్జి మీదనే వెళ్లాలి. బ్రిడ్జి మీద గుంతలు తేలడం, వర్షపు నీరు నిల్వ ఉండడంతో ద్విచక్ర వాహనదారులు పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. గతేడాది కేటీదొడ్డికి చెందిన వారు కిందపడి ఆస్పత్రి పాలయ్యారు. ఆటోలు గుంతలో దిగబడిన ఘటనలు అనేకం ఉన్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో గతంలో రైతులు సొంత ఖర్చులతో ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలించి గుంతలు పూడ్చారు. మళ్లీ వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయి. బ్రిడ్జిపై సమీపంలో సీసీ రోడ్డు వేయాలని, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి మైలగడ్డ బ్రిడ్జిపై సీసీ రోడ్డు నిర్మించి గుంతలు లేకుండా చేసి, ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

పలుమార్లు ప్రమాదాలు..



బ్రిడ్జి వద్ద గుంతలు ప్రమాదకరంగా ఉండడంతో పలుమార్లు ప్రమాదాలు జరిగాయి. గుంతల్లో నీరు నిలిచి లోతు తెలియక అనేక మంది పడిపోయిన పరిస్థితి ఉంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుంతలు మరింత పెద్దగా అవుతున్నా యి. అధికారులు చొరవ తీసుకుని గుంతలు పూడ్చాలి.

– నరేష్, సిద్దన్‌పల్లి

గుంతల్లో సీసీ వేయిస్తాం..

మైలగడ్డ బ్రిడ్జిపై గుంతలు పడిన విషయం మా దృష్టికి రాలేదు. బ్రిడ్జి వద్ద గుంతలు పడిన చోట వర్షపు నీరు నిలుస్తుడడంతో బీటీ లేచిపోతోంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా చొరవ తీసుకుంటాం. ప్రమాదాలు నివారించే దిశగా చర్యలు చేపడతాం. త్వరలో గుంతల్లో సీసీ వేయిస్తాం.

– లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ ఏఈ

నిరుపయోగంగా డ్వాక్రా భవనం



మల్దకల్: మండలంలోని ఎల్కూరులో డ్వాక్రా భవనం నిరుపయోగంగా ఉంది. 15ఏళ్ల క్రితం రూ.8లక్షల వ్యయంతో నిర్మించిన ఈ భవనం చెరువు సమీపంలో ఉండటంతో మహిళలు ఈ డ్వాక్రా భవనాన్ని వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారింది. భవనం చుట్టు కంపచెట్లు పెరిగి విష పురుగులకు ఆవాసంగా మారింది. లక్షలు వెచ్చించి నిర్మించినా డ్వాక్రా భవనం శిథిలావస్థకు చేరింది. అధికారులు స్పందించి డ్వాక్రా భవనాన్ని వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వెల్డింగ్ షాప్‌లో చోరీ

అయిజ: మండల కేంద్రంలోని చౌరస్తాలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ఇల్లూరి నాగరాజు శెట్టి వెల్డింగ్ షాప్‌లో చోరీకి పాల్పడ్డారు. సుమారు రూ.30 వేల కాపర్ వైర్‌ను అపహరించినట్లు బాధితుడు తెలిపారు. ఆదివారం శాంతినగర్ సీఐ టాటాబాబు, అయిజ ఎస్‌ఐ విజయభాస్కర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా చేశారు. ఈ విషయంపై హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసాచారిని వివరణ కోరగా, దర్యాప్తు చేసి, త్వరలో నిదితులను పట్టుకుంటామని తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

అయిజ: మండలంలోని మేడికొండ గ్రామానికి చెందిన నరేందర్ రెడ్డి ఆదివారం తన కారులో అయిజ నుంచి మేడికొండకు వెళ్తుండగా కారు అదుపు తప్పింది. ఆ ప్రదేశంలో కల్వర్టు నిర్మాణం పనులు కొనసాగుతుండడంతో డైవర్షన్ రోడ్డుపై వెళ్లాడు. గుంతలు ఉండడంతో కారు అదుపుతప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. చిన్నచిన్న గాయాలతో నరేందర్‌రెడ్డి బయటపడ్డారు. గతంలో ఇదే ప్రదేశంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగాయి. అయిజ-పులికల్ రోడ్డు నిర్మాణం చేపట్టి ఏడేళ్లు అవుతున్నా నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు నుంచి కొర్విపాడు మీదుగా అంతర్రాష్ట్ర రహదారికి వెళ్లేదారిలో బ్రిడ్జి లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం కురిస్తే రోడ్డు దాటాలంటే తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.



ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గట్టు: వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు. ఆదివారం వాహనాల తనిఖీలో భాగంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు రిజిస్ట్రేషన్ పత్రాలు వెంట పెట్టుకోవాలన్నారు. తనిఖీ సమయంలో వాటిని చూపించాలన్నారు. మైనర్లు వాహనాలు నడుపరాదన్నారు. నెంబర్ ప్లేటు లేని వాహనాలు నడపడం నేరమని, అలాంటివి పోలీసుల కంట పడితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.



అటెన్షన్ ప్లీజ్

రోడ్డు ఇలా.. వెళ్లేది ఎలా?

రోడ్డంతా మట్టి, బురద, గుంతలతో కనిపిస్తున్నది. గద్వాల-రాయచూర్ ప్రధాన రహదారిలో ధరూరులో ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని బీటీ రోడ్డు ఇది. గుంతలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా, ఏదో చేశా మని చెప్పుకునేందుకు మట్టి నింపి కాలం వెళ్లదీస్తున్నారు. ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటేనే వాహనదారులు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ మాత్రం ఆదమరిచినా భారీ వాహనాలకు ప్రమాదం పొంచి ఉంది.

– ధరూరు



సంప్రదించవలసిన అధికారి : రాజేశ్వరి, ఆర్‌అండ్‌బీ జేఈ
ఫోన్ నెంబర్ : 9440817165

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

అయిజ: తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ జోగమ్మ అన్నారు. ఆదివారం 'సాక్షి' దినపత్రికలో 'తాగునీటి వసతి కల్పించండి' అనే కథనం ప్రచురితమైంది. దీంతో ఆర్టీసీ డిపో అధికారులు స్పందించారు. ఆదివారం ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ జోగమ్మ అయిజ ఆర్టీసీ ప్రాంగణం సందర్శించారు. ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడానికి కారణాలు ఆర్టీసీ కంట్రోలర్ అమర్‌నాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యను డిపో మేనేజర్‌కు తెలియజేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం అసిస్టెంట్ డీఎం ఆర్టీసీ ప్రాంగణం చుట్టూ పరిసరాలను పరిశీలించారు. ప్రాంగణంలో ఆటోలు, కార్లు, జీపులు నిలుపుతున్నారని, చిరు వ్యాపారులు ఆర్టీసీ ప్రాంగణం సమీపంలో రోడ్డుపై విక్రయాలు నిర్వహిస్తున్నారని, దాని వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వారిని అక్కడ నుంచి తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి, ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయాలని పోలీస్ శాఖ వారిని కోరుతామన్నారు. ఆర్టీసీ ప్రాంగణం చుట్టుపక్కల ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని అరికట్టేందుకు పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆర్టీసీ ప్రాంగణంలో నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ ఆమె హెచ్చరించారు.



ఆర్టీసీ కంట్రోల్ రూంలో వివరాలు సేకరిస్తున్న డిపో అసిస్టెంట్ మేనేజర్ జోగమ్మ

స్థానిక ఎన్నికల్లో పోటీకి సీపీఎం సిద్ధం

అలంపూర్: సమస్యల పరిష్కారానికి రాబోయే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు సీపీఎం సిద్ధంగా ఉందని జిల్లా కమిటీ సభ్యుడు రాజు, మండల కార్యదర్శి నరసింహ తెలిపారు. అలంపూర్ పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్డీఎస్ చివరి ఆయకట్టుకు సాగు నీరు అందించడంలో స్థాని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. పదిహేనేళ్ల క్రితం అలంపూర్‌కు వరదల ముంచేత్తి బీభత్సం సృష్టించిందన్నారు. వరద బాధితుల పునరావసం కోసం స్థలాలు సేకరించినా వారికి చూపడం లేదన్నారు. నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి వనరులు పుష్కలంగా ఉన్నా గెలిచిన నాయకులు పట్టించుకోకపోవడంతో నిరుద్యోగ సమస్యను ఎదుర్కొవాల్సి వస్తోందన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కమిటీ సభ్యుడు రాజు

గెలిచిన నాయకులు వారి స్వార్థం కోసం పనులు చేయకపోవడంతోనే అభివృద్ధిలో వెనకబడిందన్నారు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. కొత్తగా ఆవిర్భవించిన మున్సిపాలిటీలోని వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయలేదన్నారు. సమావేశంలో నాయకులు జీకే ఈదన్న, బంగారు రఫీ, నాగరాజు ఉన్నారు.

ఆస్పత్రిని వినియోగంలోకి తేవాలి

అయిజ: మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రిని వినియోగంలోకి తేవాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం అఖిలపక్ష కమిటీ సమావేశం నిర్వహించి పలు సమస్యలను చర్చించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కమిటీ ప్రెసిడెంట్ ఆంజనేయులు మాట్లాడుతూ అయిజలో 30 పడకల ఆస్పత్రిని వినియోగంలోకి తేవాలని, వాగులో మట్టిదిబ్బలు, ముళ్ల పొదలు తొలగించాలన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు మంజూరు చేయాలన్నారు. అయిజను నియోజకవర్గ కేంద్రంగా మార్చాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు ఆంజనేయులు, వినోద్, వెంకట్రాములు, పల్లయ్య, ప్రమేలత, తాహేర్, తిర్మల్ రెడ్డి, మద్దిలేటి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష కమిటీ ప్రెసిడెంట్ ఆంజనేయులు

ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన నాయకులు

గద్వాల: ఎమ్మెల్సీగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాంను నడిగడ్డ తెలంగాణ సోషల్ ఫోరం నాయకులు ఆదివారం కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే మంత్రివర్గ విస్తరణలో కోదండరాంకు స్థానం కల్పించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు లక్ష్మీ నారాయణ, బుచ్చన్న, ప్రతాప్, ఈశ్వర్, రాజుసాగర్, వినయ్‌గౌడ్, నర్సింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.